# భద్రకాళీ పూడికతీతలో కమీషన్ల మేత

వరంగల్, జూన్ 14 : చారిత్రక భద్రకాళీ చెరువు పూడికతీత పనుల్లో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు కమీషన్ల మేత మేస్తున్నారని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆరోపించారు. శనివారం ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి పూడికతీత పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భద్రకాళీ చెరువు పూడికతీత పేరుతో కాంగ్రెస్ నాయకులు కోట్ల రూపాయల అవినీతికి తెరలేపారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటంగా చేపట్టిన పూడికతీత పనుల్లో పారదర్శకత లోపించిందని, టెండర్లలో గోల్ మాల్ జరిగిందన్నారు. గతేడాది నవంబర్‌లో నీటిని వదిలినా మార్చి వరకు టెండర్లు పిలవకపోవడంలో మతలబేంటని ప్రశ్నించారు. అర్హత లేని వారితో కుమ్మక్కయిన కుడా, ఇరిగేషన్ అధికారులు కమీషన్ల ప్రాతిపదికనే టెండర్లు కేటాయించారన్నారు. జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీ, మేయర్ల కమీషన్ల వాటా కోసమే పనుల్లో జాప్యం జరుగుతున్నదన్నారు. అసమర్థ కాంట్రాక్టర్లకు టెండర్లు కేటాయించారని మండిపడ్డారు. నత్తనడకన సాగుతున్న పూడికతీత పనులను వేగవంతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జూన్ 15 నాటికి పనులు పూర్తి చేస్తామన్న మంత్రుల హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇప్పటి వరకు పనులు ఎంత వరకు అయ్యాయో తెలియని పరిస్థితి నెలకొన్నదన్నారు. వర్షాలు పడితే జరిగిన పనులను ఎలా అంచనా వేస్తారన్నారు. భద్రకాళీ బండ్ నిర్మించినప్పుడు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని గగ్గోలు పెట్టిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు చెరువులో ఐల్యాండ్స్ ఎలా నిర్మిస్తున్నారని ప్రశ్నించారు. ఐల్యాండ్ల నిర్మాణాలతో చెరువును కుదించారని అన్నారు. మత్తడి నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని, పూడితతీత పనుల లెక్కలు తేలే వరకు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించొద్దని, అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. భద్రకాళీ చెరువుపై ఆధారపడి 800 మత్స్యకార కుటుంబాలు జీవిస్తున్నాయని, వారంతా ఉపాధి కోల్పోయారని అన్నారు. రెండు వేల మంది మత్స్యకారులు నష్టపోతున్నారని వారికి జీవన భృతి చెల్లించాలన్నారు. నీళ్లు నిలిచిన గుంతలో పడి బాలుడు మృతి చెందడం బాధాకరమని, బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేయాలని దాస్యం డిమాండ్ చేశారు. ఆయన వెంట కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్లు మరుపల్ల రవి, బోయినపల్లి రంజిత్‌రావు, మేకల బాబురావు, దిడ్డి కుమారస్వామి ఉన్నారు.

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్



పూడికతీత పనులను పరిశీలిస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్

# విమానం ఎగిరేనా?

## అడిగిన పరిహారం ఇవ్వరు.. అభివృద్ధి చేయరు

### మామునూరు ఎయిర్‌పోర్ట్‌పై అయోమయం



మామునూరు ఎయిర్‌పోర్టు స్థలం

- ముందుకు సాగని భూసేకరణ ప్రక్రియ
- సర్వే పూర్తయినా మొదలు కాని కార్యాచరణ
- ఒక్క అడుగూ ముందుకు పడని వైనం
- ధర నిర్ణయించడంపై అధికారుల సాగతీత
- సమీక్షలతో సరిపెట్టుకుంటున్న మంత్రులు

వరంగల్, జూన్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కీలక మలుపుగా భావించే మామునూరు ఎయిర్‌పోర్టు పునరుద్ధరణ ప్రక్రియ ఎంతకీ ముందుకు సాగడం లేదు. ఎయిర్‌పోర్టు అభివృద్ధికి అవసరమైన భూసేకరణ ప్రక్రియలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎడతెగని జాప్యం చేస్తున్నది. వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మంత్రి కొండా సురేఖ ఎన్నిసార్లు సమీక్షలు నిర్వహించినా ఎయిర్‌పోర్టు అభివృద్ధిలో ఎలాంటి మార్పు ఉండడం లేదు. మౌఖిక ఆదేశాలతో సమీక్షలు ముగిసిపోతున్నాయి. వరంగల్ జిల్లాలోని అధికార యంత్రాంగం తీరు ఇలాగే ఉంటున్నది. సమీక్ష తర్వాత రెండు మూడు రోజులు హడావుడి చేసి ఆ తర్వాత పక్కన పెడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగం తీరుతో మామునూరు ఎయిర్‌పోర్టు పునరుద్ధరణపై అయోమయం నెలకొన్నది. ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు అవసరమైన భూ సేకరణ కోసం వరంగల్ జిల్లా యంత్రాంగం సర్వే చేసి నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. భూములు కోల్పోతున్న వారికి నష్టపరిహారం నిర్ణయించడంలో జాప్యం జరుగుతున్నది. మూడు సార్లు రైతులతో సమావేశాలు నిర్వహించినా పరిహారం ధరపై స్పష్టమైన నిర్ణయానికి రావడం లేదు. ఇటీవల జరిగిన సమావేశంలో వ్యవసాయ భూమికి ఎకరాకు రూ.1.20కోట్లు, లే అవుట్ ప్లాట్‌కు చదరపు గజానికి రూ. 4,887 చొప్పున అధికారులు ప్రతిపాదించారు. భూములు కోల్పోతున్న రైతులు ఈ ధరను అంగీకరించలేదు. మరోసారి సమావేశమవుదామని చెప్పి అధికారులు వాయిదా వేశారు. భూసేకరణపై నాలుగు నెలలుగా ఇదే వైఖరి కొనసాగుతున్నది. మామునూరు ఎయిర్‌పోర్టుకు ఇప్పటికే 696 ఎకరాల భూమి ఉండగా, మరో 253 ఎకరాలు అవసరం ఉన్నది. దీంట్లో 220 ఎకరాల వ్యవసాయ భూమి, 33 ఎకరాల ప్లాట్లు ఉన్నాయి. నక్కలపల్లిలో 47 ఎకరాలు, గాడిపల్లిలో 197 ఎకరాలకు సంబంధించి సర్వే చేసిన అధికారులు నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి మూడు నెలలవుతున్నది. రైతులకు న్యాయం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగం తీవ్ర జాప్యం చేస్తుండడంతో భూ సేకరణకు అడ్డంకులు పెరుగుతున్నాయి. ఎయిర్‌పోర్టు పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చినప్పటి నుంచి ముందుగానే భూములు కొనుగోలు చేసిన కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇక్కడి భూముల ధరలు పెంచుతున్నారు. అధికారులు తమ ప్రతిపాదనలు ప్రకటించే సమయానికి భూ యజమానులు అంతకుముందు సమావేశంలో కంటే ధరలను పెంచి చెబుతుండడంతో భూ సేకరణలో స్తబ్ధత ఏర్పడుతున్నది.

### బీఆర్ఎస్ హయాంలో అడుగు

హైదరాబాద్ రాష్ట్రాన్ని పాలించిన నిజాం సర్కారు హయాంలో వరంగల్ సుబేదార్ (ప్రాంతీయ కేంద్రం)గా ఉండేది. వరంగల్‌లో అప్పుడు అజంజాహి టెక్స్‌టైల్ మిల్లును ఏర్పాటు చేశారు. మీర్ ఉస్మాన్ అలీఖాన్ హయాంలో మామునూరు ఎయిర్ పోర్టును నిర్మించడంతో హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి వాయుదూత్ పేరుతో 1930 నుంచి విమానాలు నడిచేవి. కేంద్ర ప్రభుత్వ విధానాలు, ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో 1981లో సర్వీసులు నిలిచిపోయాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మామునూరు ఎయిర్‌పోర్టు సేవల పునరుద్ధరణకు అడుగులు పడ్డాయి. ఇందుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ ప్రణాళికను 2020లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూపొందించింది. ఈ ప్రతిపాదనలతో 2022లో కేంద్ర ప్రభుత్వం మామునూరు ఎయిర్‌పోర్టును ఉడాన్ పథకంలో చేర్చింది. మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధి కోసం 2023లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త బృందం ఏర్పాటు కాగా, రూ. 592 కోట్లతో పునరుద్ధరించాలని పేర్కొన్నది. ఇందుకు అవసరమైన నిర్ణయాలు, నిధులు, భూసేకరణపై కార్యాచరణను ప్రతిపాదించింది. విమాన సర్వీసుల పునరుద్ధరణ కోసం మామునూరు ఎయిర్‌పోర్టులో 2.9 కిలోమీటర్ల పొడవుతో రన్‌వే, టెర్మినల్ బిల్డింగ్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్, నేవిగేషన్ ఇన్‌స్ట్రుమెంట్ ఇన్‌స్టలేషన్ నిర్మించాలని సూచించింది. ఇందుకోసం అప్పటికే ఉన్న 696 ఎకరాల భూమికి అదనంగా మరో 253 ఎకరాలు సేకరించాలని నిర్ణయించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం 2024 నవంబర్ 17న రూ. 205 కోట్లు విడుదల చేసింది.

### నాలుగు నెలలుగా..

వరంగల్ నగర సమీపంలోని మామునూరు ఎయిర్‌పోర్టు అభివృద్ధి, విమాన సర్వీసుల పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఆ దిశగా కార్యాచరణ అమలు కావడంలేదు. శంషాబాద్ ఎయిర్‌పోర్టును నిర్మించే ముందు కేంద్ర ప్రభుత్వంతో, హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ సంస్థ ఒప్పందం చేసుకున్నది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి 150 కిలోమీటర్ల పరిధిలో అప్పటికే ఉన్న విమానాశ్రయాలు, కొత్త వాటి అభివృద్ధికి అనుమతించొద్దని ఒప్పందం చేసుకుంది. హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి 150 కిలో మీటర్ల పరిధిలో మరో ఎయిర్‌పోర్టు సర్వీసులు ఉండకూడదనే నిబంధనను కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో రద్దు చేసింది. మామునూరు ఎయిర్‌పోర్టు పునరుద్ధరణ పనుల్లో అప్పటి నుంచి ఎలాంటి పురోగతి కనిపించడం లేదు.

# నీట్ ఫలితాల్లో శివాని విశ్వరూపం



ముకేశ్ | మనోజ్ | కార్తీక్ | నిస్సీ

హసన్‌పర్తి, జూన్ 14 : నీట్ ఫలితాల్లో శివాని కళాశాల విద్యార్థులు మరోసారి విశ్వరూపం ప్రదర్శించారు. 720 మార్కులకు మదురి ముకేశ్ 495, ఆడెపు మనోజ్ 451, ఇటికాల కార్తీక్ 443, అరికిల్ల నిస్సీ 438 సాధించి మరోసారి సత్తా చాటినట్లు కళాశాల కరస్పాండెంట్ టీ స్వామి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేండ్లుగా కార్పొరేట్ కళాశాలలకు దీటుగా శివాని కళాశాల ర్యాంకులు సాధిస్తున్నదన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ర్యాంకర్లుగా తయారుచేయడం అందరికీ తెలుసని, అయితే సాధారణ స్టూడెంట్స్‌ను సైతం ర్యాంకర్లుగా తీర్చిదిద్దడం ఒక్క శివానికే సాధ్యమన్నారు. కాగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ స్వామితో పాటు ప్రిన్సిపాళ్లు జీ సురేందర్‌రెడ్డి, వీ చంద్రమోహన్, డైరెక్టర్లు టీ రాజు, ఎన్ రమేశ్, ఏ మురళీధర్, వీ సురేశ్, ఎస్ సంతోష్ అభినందించారు.

# నీట్ ఫలితాల్లో ఎస్సార్ ప్రభంజనం



సాయిదివ్యాన్ | ప్రియాంక | వినయ్ | గణేశ్

హనుమకొండ చౌరస్తా, జూన్ 14 : నీట్ ఫలితాల్లో తమ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించి మరోసారి జాతీయస్థాయిలో విజయపతాకం ఎగురవేశారని ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి తెలిపారు. జాతీయస్థాయిలో అన్ని కేటగిరీలు కలిపి పీ సాయిదివ్యాన్ 14, బీ ప్రియాంక 100, ఎం వినయ్ 226, బీ గణేశ్ 671వ ర్యాంకు సాధించి ఎస్సార్ కీర్తి ప్రతిష్టను నిలబెట్టారన్నారు. రాష్ట్రంలోని ఎస్సార్ విద్యాసంస్థలకు చెందిన 210 మందికిపైగా విద్యార్థులు మెడిసిన్‌లో సీట్లు సాధించే ర్యాంకులు పొందారని చెప్పారు. విద్యార్థులు సాధించిన విజయానికి సంతోషాన్ని తెలియజేస్తూ చైర్మన్ వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి భవిష్యత్‌లో మరింత అత్యుత్తమైన ర్యాంకులు సాధించేలా తీర్చిదిద్దుతామని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. 50 ఏళ్లలో పటిష్టమైన ప్రణాళికలతో హైస్కూల్, జూనియర్ కాలేజీ, ఇంజినీరింగ్, ఐఐటీల్లో విద్యనందిస్తూ ప్రతి సంవత్సరం రాష్ట్ర, జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామన్నారు. అలాగే ఈ ఏడాది జేఈఈ మెయిన్స్‌లో జాతీయస్థాయిలో సాధించిన ఉత్తమ ఫలితాలు విద్యార్థులందరికీ స్ఫూర్తిదాయకం కావాలని వారు ఆకాంక్షించారు.

# షైన్ విద్యార్థుల విజయకేతనం



కీర్తన | సహస్ర | ఇందు | వెంకటశివాని

హనుమకొండ, జూన్ 14 : నీట్–2025 ఫలితాల్లో షైన్ జూనియర్ కళాశాల విద్యార్థులు కార్పొరేట్ విద్యా సంస్థలకు సమానంగా ఫలితాలు సాధించినట్లు చైర్మన్ మూగుల కుమార్‌యాదవ్ తెలిపారు. శనివారం ఫలితాలు విడుదలైన నేపథ్యంలో హనుమకొండలోని షైన్ కళాశాలలో డైరెక్టర్లు మూగుల రమ, మూగుల రమేశ్‌యాదవ్‌తో కలిసి అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కుమార్‌యాదవ్ మాట్లాడుతూ తాము మొదటి నుంచి నీట్, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌లో అత్యుత్తమ శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. జాతీయస్థాయిలో జీ కీర్తన 498, కే సహస్ర 497 మార్కులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. అలాగే డీ ఇందు 437, టీ వెంకటశివాని 427, కే శరణ్య 376, టీ హాసిని 328 మార్కులు సాధించినట్లు తెలిపారు. వీరితోపాటు 15మంది విద్యార్థులు 300కు పైగా మార్కులతో విజయకేతనం ఎగురవేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ మారబోయిన రాజు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ప్రశాంత్, అధ్యాపక బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రొటోకాల్ లేకున్నా ఎందుకు వెళ్లినట్టు?

### తూర్పు పోలీసులపై నిఘా వర్గాల ఆరా

నమస్తే ఎఫెక్ట్

సుబేదారి, జూన్ 14 : వరంగల్ తూర్పు నియోజకవర్గం వరంగల్ సబ్ డివిజన్ పోలీసు అధికారులపై నిఘా వర్గాలు ఆరా తీస్తున్నాయి. పోలీసు శాఖ నిబంధనలేవీ పట్టించుకోకుండా డ్యూటీ వదిలి అధికార పార్టీ నేత కొండా మురళీధర్‌రావుకు ఎస్కార్ట్ వెళ్లిన పలువురు పోలీసుల తీరుపై శనివారం నమస్తే తెలంగాణ దినప్రతికలో 'విధులను వదిలి.. కొండా వెంట వెళ్లి' శీర్షికన ప్రచురితమైన కథనానికి కమిషనరేట్ ఇంటలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ అధికారులు స్పందించిన ఆరా తీశారు. కొండా మురళికి ప్రొటోకాల్ లేకపోయినా ఎందుకు వెళ్లారు?, ఎవరైనా ఆదేశాలిచ్చారా? ఉన్నతాధికారుల అనుమతి తీసుకున్నారా? అనే కోణాల్లో క్షేత్రస్థాయిలో కూపీలాగారు. ఈ విషయంలో పోలీసు సీపీ సన్‌ప్రీత్‌సింగ్ ప్రత్యేక దృష్టిపెట్టినట్లు తెలిసింది. కాగా నమస్తే కథనం కమిషనరేట్ పోలీస్ వర్గాల్లో, తూర్పు నియోజకవర్గ ప్రజల్లో చర్చనీయాశంమైంది.

# మా డబ్బులు ఇప్పించండి

- అక్షర చిట్ ఫండ్ వద్ద బాధితుల ఆందోళన
- యజమానిని అప్పగించాలని డిమాండ్



అక్షర చిట్‌ఫండ్ ముందు బైఠాయించిన బాధితులు

హనుమకొండ, జూన్ 14 : తమకు రావాల్సిన డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ హనుమకొండ నక్కలగుట్టలోని అక్షర చిట్‌ఫండ్ ఆఫీసు ముందు బాధితులు శనివారం ఆందోళన చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన బాధితులు చిట్టీలు, డిపాజిట్ల పేరుతో యాజమాన్యం తమను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిట్టీలు పూర్తయినా, డిపాజిట్ల గడువు ముగిసినా డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నదని మండిపడ్డారు. చిట్ యాజమానిని పిలిపించి తమకు అప్పగించి న్యాయం చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఇప్పటికే అనేకసార్లు ధర్నాలు చేసినా, నిరసనలు తెలిపినా, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద సంఖ్యలో బాధితులు అక్షర చిట్‌ఫండ్ కార్యాలయం వద్దకు చేరుకున్న విషయం తెలుసుకున్న సుబేదారి పోలీసులు అక్కడికి వచ్చి ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా బాధితులను సముదాయించే ప్రయత్నం చేశారు. తాము ఎంతో నష్టపోయామని, గతంలో పోలీసు అధికారులు న్యాయం చేస్తామని ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తమ డబ్బులిచ్చే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకొని కూర్చున్నారు. యజమానిని తీసుకొచ్చి తమకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకున్నారు.

# విద్యుత్ షాక్‌తో లైన్‌మన్ మృతి

### మ్యారేజ్ డే మరుసటి రోజే ఘటన



క్రాంతికుమార్ (ఫైల్)

డోర్నకల్, జూన్ 14 : పెండ్లి రోజు జరుపుకొన్న మరుసటి రోజే కరెంట్ షాక్‌తో విద్యుత్ ఉద్యోగి మృతిచెందాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలో శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. డోర్నకల్ సబ్‌స్టేషన్ అసిస్టెంట్ లైన్‌మన్‌గా పనిచేస్తున్న బీ క్రాంతికుమార్(32) మున్నేరు వాగు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు పనులు చేస్తుండగా, కరెంటు తీగ తగిలి షాక్ గురయ్యాడు. దీంతో స్థానిక రైతు.. ఏఈ కిరణ్‌కు సమాచారం ఇవ్వడంతో పాటు సీపీఆర్ చేసి, పంట పొలాల మీదుగా బైక్‌పై తీసుకొచ్చి 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనా స్థలాన్ని ఏఈ కిరణ్, ఎస్సై ఉమ పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. క్రాంతికుమార్‌ది నర్సింహులపేట మండలం. ఈ నెల 13న(శుక్రవారం) క్రాంతికుమార్ మ్యారేజ్ డేను సంబురంగా చేసుకొని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడిపాడు. పెండ్లి రోజు జరుపుకొన్న మరుసటి రోజే మృత్యువాతపడడంతో కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకున్నది.

# కరంటోళ్ల నిర్లక్ష్యం.. ఇద్దరికి ప్రాణాపాయం!


- ఎల్‌సీ ఇచ్చి అనుమతి లేకుండానే విద్యుత్ సరఫరా
- షార్ట్ సర్క్యూట్‌తో ఇద్దరి పరిస్థితి విషమం.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- సబ్ స్టేషన్‌ను ముట్టడించి, ఏఈ హరిబాబును ఘెరావ్ చేసిన బాధిత కుటుంబాలు



నల్లబెల్లిలో విదుత్‌షాక్‌తో అపస్మారక స్థితిలో ఉన్న సాదుకుమార్



మూడుచెక్కలపల్లెలో షాక్‌తో గాయపడ్డ శ్రీనివాస్



మూడుచెక్కలపల్లె సబ్‌స్టేషన్ వద్ద ఏఈని నిలదీస్తున్న రైతులు

నల్లబెల్లి, జూన్ 14 : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ఇద్దరి ప్రాణాల మీదికి తేగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలై దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలో శనివారం జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. మూడుచెక్కలపల్లె సబ్‌స్టేషన్‌లో అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూటర్ వర్కర్‌గా నీలం శ్రీనివాస్ విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా, లైన్‌తండాకు చెందిన కొందరు రైతులు ట్రాన్స్‌ఫార్మర్ సరిగ్గా పనిచేయడం లేదని, మరమ్మతు చేయించాలని కోరగా, శ్రీనివాస్ సంబంధిత ఏఈ హరిబాబుకు సమాచారం ఇచ్చి ఎల్‌సీ తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతు పనులు చేయిస్తున్నారు. ఈ క్రమంలో సబ్‌స్టేషన్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న జేఎల్‌ఎం రమేశ్ ఎల్‌సీ తీసుకున్న విషయం కన్ఫార్మ్ చేసుకోకుండానే సబ్‌స్టేషన్‌ను ఆన్ చేశాడు. దీంతో లైన్‌తండా వద్ద ట్రాన్స్‌పార్మర్ మరమ్మతు పనులు చేస్తున్న అన్‌మ్యాన్డ్ శ్రీనివాస్ విద్యుదాఘాతానికి గురికాగా, చుట్టు పక్కల రైతులు హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. మరో ఘటనలో ఇదే నల్లబెల్లి మండలకేంద్రంలోని ఓ రైస్‌మిల్లు యజమాని తన ఇంటి వద్ద తాగు నీటి కోసం బోరు వేయించుకునే క్రమంలో, స్థానిక సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అయితే, ఎలాంటి కన్ఫర్మేషన్ లేకుండానే విద్యుత్ సరఫరా చేయడంతో వాహనం వద్ద పనిచేస్తున్న నలుగురు సిబ్బంది షాక్‌కు గురయ్యారు. ఈ ఘటనలో సాదుకుమార్ అనే వ్యక్తికి 60 శాతం గాయాలు కాగా, అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఇళయరాజా అనే వ్యక్తికి 40 శాతం గాయాలయ్యాయి. అజిత్‌కుమార్‌తో పాటు సెల్వకుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. గాయపడిన వారిది తమిళనాడు రాష్ట్రమని తెలిసింది. కాగా, ఈ ఘటనకు ఏఈ హరిబాబే కారణమంటూ రైతులు సబ్‌స్టేషన్‌ను ముట్టడించి ఏఈని ఘెరావ్ చేశారు. రెండు ఘటనలకు కారణమైన ఏఈని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా రైతుల అవసరాలను ఏఈ హరిబాబు క్యాష్ చేసుకుంటూ 24 గంటల విద్యుత్ సరఫరా చేయకుండా వసూళ్ల దందా చేస్తున్నాడని పలువురు రైతులు ఆరోపించారు. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులైన ఏఈ హరిబాబు, జేఎల్‌ఎం రమేశ్‌ను సస్పెండ్ చేస్తానని విద్యుత్ శాఖ డీఈ పెండోట తిరుపతి తెలిపారు.











